సురుల గాచిన దేవరకు చుంచు గరుడు నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మానీటు చేతల పట్టికి
విరుల వింటి వాని అయ్యకు వేవేల రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీ వేంకటనాధునికి ॥చందమామ॥

**భావామృతం**

ఓ చందమామా! ఇటు వైపుకు ఒక్కసారిరా. చల్లటి జాబిల్లీ (జాను+బిల్లి=జాబిల్లి, అనగా అందమైన పిల్లి, అనగా కుందేలు అంటే... కుందేలు తనలో ఉన్నవాడు, అనగా చంద్రుడు) ఇటు రారాదా! పదియారు వెన్నపూర్తిగా తీయని పాలను మా బాబుకు తీసికొని రారాదా.

మా బాలుడు నవ్వుకవలొలికే ముఖమున్న చక్కనయ్య. బ్రహ్మదేవునికి జన్మనిచ్చిన తండ్రి. వేదములన్నింటిలో కీర్తించబడిన జనకుడు. నీలమేఘచ్ఛాయ గల శరీరం దాల్చిన వాడు జగన్నాధుడు. అందాల బొమ్మ లక్ష్మీదేవికి ప్రియమైన మగడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అని పిలవబడే ముగ్గురు దేవుళ్ళకు అది దేవుడు. ఇతడే ముద్దులు మూటగట్టే మా మురారి.

సర్వశ్రేష్ఠుడైన వీడు తెల్లని పద్మముల వంటి కన్నులు గలవాడు. మధురమైన మంచి మాటలు మాట్లడే అలంకార ప్రియుడు. ఒయ్యారము లొలుకు మనోజ్ఞమైన చేతలు గల శృంగారమూర్తి (మోహినీదేవి). లెక్కకు మించిన కథలు (పురాణములు) పుట్టుటకు కారణ భూతడైన. వామన మూర్తి. ఆదిత్యకులమును వుద్ధరించిన గుణవంతుడైన బిడ్డ ఈ బాలుడే (రాముడు). ఈ అబ్బాయి సుగుణాలప్రోవు. నవనిధులను ప్రసాదించు వాడు.

ఈ దేవుడే దేవతలందరినీ రక్షించిన వేలుపు. తెల్లటి గరుత్మంతుని అధిరోహించి ఠీవిగానుండే వాడితడే. యుక్తమైన బుద్ధులు గల పెద్దమనిషి కూడ ఇతగాడే. ఇతను చేసే పనులన్నీ తీర్తినట్లుంటాయి. ఈయనెవరనుకున్నారు? స్వయాన మన్మధునికి జన్మనిచ్చినవాడు. అంతేకాదు అనంతమైన (వేలకొద్దీ) రూపములు గలవాడు. ఇదిగో ఈ మా శ్రీ వేంకటేశ్వరుడు అధికముగా ఐశ్వర్యములను ప్రసాదించు జాణ (నేర్పరి).